బాబోయ్.. బాప్టిస్ట్‌పాలెం యూపీహెచ్‌సీ

- బ్లేడ్ బ్యాచ్, మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ముళ్లపొదలు, పిచ్చి మొక్కల మధ్య ఆస్పత్రి భవనం
- ఆస్పత్రికి రావాలంటేనే భయపడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు



బాప్టిస్ట్‌పాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం


ముళ్ల పొదలతో నిండిన ఆస్పత్రి ప్రాంగణం

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): ఒకప్పుడు స్థానికులకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తిన అందుబాటులో ఉన్న బాప్టిస్ట్ పాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలి వచ్చేవారు. పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, కేదారేశ్వరపేట, పాత ఆర్‌ఆర్‌పేట ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం బ్లేడ్ బ్యాచ్, గంజాయి, మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో ప్రజలు బాబోయ్.. బాప్టిస్ట్‌పాలెం యూపీహెచ్‌సీనా అంటున్నారు.

భయాందోళనలో రోగులు..

గతంలో పూల చెట్లు, పచ్చటి మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపించే ఆస్పత్రి నేడు ముళ్ల పొదలు, పిచ్చి చెట్లతో నిర్వీర్యంగా మారింది. దీంతో విషపురుగులు, పాములు చేరి ఆస్పత్రికి వచ్చే రోగులను భయందోళనకు గురిచేస్తున్నాయి. మచిలీపట్నం, హైదరాబాద్, విశాఖపట్నం వైపు వెళ్లే రైల్వే లైన్లకు దగ్గరగా ఈ యూపీహెచ్‌సీ ఉంది. సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉండటంతో ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా లేకపోవటంతో బ్లేడ్ బ్యాచ్, మందు బాబులు రెచ్చిపోతున్నారు. అస్పత్రినే తమ అడ్డాగా మార్చుకుని చెలరేగిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.


ఆస్పత్రి ఆవరణలో పడ వేసిన మద్యం సీసాలు

జంకుతున్న ఆస్పత్రి సిబ్బంది

ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆస్పత్రి ఆవరణలో పదుల సంఖ్యలో మద్యం సీసాలు, గంజాయి తాగిన సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రి వేళల్లోనూ బ్లేడ్ బ్యాచ్, మందుబాబులు అక్కడ తిష్ట వేస్తున్నారు. నిత్యం గోడలు దూకి వచ్చే బ్లేడ్ బ్యాచ్, మందుబాబుల ఆగడాలతో భయాందోళనకు గురవుతున్నామని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం రక్త పరీక్షలకు వచ్చే రోగులు బ్లేడ్ బ్యాచ్, మందుబాబులను చూసి వెనక్కు వెళ్లిపోతున్నారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. ఆస్పత్రి చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించి, పోలీసు నిఘా ఏర్పాటుచేస్తే బ్లేడ్‌బ్యాచ్, మందుబాబుల ఆగడాలు తగ్గుతాయంటున్నారు. అదే విధంగా వాచ్ మెన్‌ను ఏర్పాటు చేయమని అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవటం లేదని వారు వాపొతున్నారు.

మద్యం మత్తులో గొడవలు..

అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలంటేనే భయమేస్తోంది. అక్కడ మందు బాబులు మద్యం మత్తులో చేసే గొడవలతో వెళ్లలేక పోతున్నాం. వారి అగడాలను అడ్డుకుంటే కాని పరిస్థితి మారదు.

–మేరి, స్థానికురాలు

రక్త పరీక్షలకు వెళ్లలేక పోతున్నాం..

నాకు మధుమేహం ఉంది. ఉదయం రక్త పరీక్షలు చేయించుకోవడానికి వెళ్తే తాగిన మత్తులో మందు బాబులు, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు మెట్లపైనే పడుకోని ఉంటున్నారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది కూడా ఆలస్యంగా వస్తున్నారు.

– కుటుంబరావు, స్థానికుడు

క్లుప్తంగా

రెండు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణలంకలోని బీజేజీఆర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలో ఖాళీగా ఉన్న రెండు సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు కృష్ణా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు పేర్కొన్నారు. ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. రోస్టర్ ప్రకారం బీసీ(ఏ), ఓసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్ల నిర్మాణ ప్రాంతాల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): నగరంలో నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో త్వరలో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. సర్కిల్–1 పరిధిలోని బీఆర్పీ రోడ్, నెహ్రూ రోడ్, కేటీ రోడ్, కుమ్మరిపాలెం, సితార సెంటర్ నుంచి సీవీఆర్ ప్లైఓవర్, మొత్తం 7.37 కిలోమీటర్ల రోడ్లను, సర్కిల్–2 పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్, సాంబమూర్తి రోడ్, జీఎస్ రాజు రోడ్, 7.26 కిలోమీటర్ల రోడ్లను, సర్కిల్–3 పరిధి లోని పటమట హైటెన్షన్‌లైన్ రోడ్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, టిక్కిల్ రోడ్, సిద్ధార్థ స్కూల్ రోడ్, జమ్మి చెట్టు సెంటర్ నుంచి సిద్ధార్థ సర్కిల్ వరకు, మదర్‌థెరిసా సర్కిల్ నుంచి అమ్మ కల్యాణ మండపం వరకు, పీవీపీ మాల్ రోడ్, రమేష్ హాస్పటల్ ప్రాంతాల్లో జరుగుతున్న 8.37 రోడ్లను పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సభ్యులు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానాలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా డివిజన్‌లోని సమస్యల పరిష్కారం కోసం పశ్చిమ నియోజకవర్గ తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగాలని కోరారు. కరకట్ట ప్రాంతంలోని నివాసాలకు రెగ్యులరైజేషన్ పట్టాలు(పర్మినెంట్ పట్టా) ఇప్పించాలని, నూతన రేషన్ కార్డుల జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల సంభవించిన కృష్ణానది వరద కారణంగా నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం అందించాలని, కృష్ణానది తీరాన కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు షేక్ హయాత్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద



విజయవాడకల్చరల్: భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద అని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి వజ్రదాస్ గురుజీ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను మంగళవారం చుట్టగుంటలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. వజ్రదాస్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ కృష్ణుడు మనకు అందించిన వరం భగవద్గీత అని అని నిత్య పారాయణీయ గ్రంథం కావాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, బొగ్గవరపు రాధాకృష్ణ, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్, మిత్తింటి శారద, వాసవీ క్లబ్ సభ్యుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, పొక్కులూరి సుబ్బారావు, టి.సావిత్రి, ఆర్.సావిత్రి కనకదుర్గ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలు: జూనియర్ విభాగం సంపూర్ణ భగవద్గీత పోటీలో దీక్షిత(ప్రథమ), సీనియర్ విభాగంలో పి.లక్ష్మీ ప్రసన్న(ద్వితీయ), వీవీఎస్ శ్రీధర్ శర్మ (తృతీయ), సీనియర్ విభాగంలో లక్ష్మీప్రసన్న(ప్రథమ) వీవీఎస్ శ్రీధర్ శర్మ(ద్వితీయ), ఎం.దివ్యసాహితీ (తృతీయ)కి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

రేపు ఎస్ఆర్ఆర్‌లో జాబ్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేకేసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ – సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 12వ తేదీ గురువారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిఉన్నవారు వివరాలకు 77996 69907 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



చిలుకూరువారిగూడెం(మైలవరం): కృష్ణా మిల్క్ యూనియన్ మైలవరం క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెక్కులను మంగళవారం చైర్మన్ చలసాని ఆంజనేయులు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ పశువులకు మినరల్ మిక్చర్, కాల్షియం, నులి పురుగుల ట్యాబ్లెట్స్ అందజేస్తున్నామని చెప్పారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఏజీఎం ఎం. అన్వేష్, మైలవరం క్లస్టర్ మేనేజర్ టి. సాంబశివమూర్తి, పాల సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతాంగాన్ని దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

- మాజీ మంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా
- 13న జరిగే రైతు ధర్నా జయప్రదం చేయాలని పిలుపు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో రైతాంగాన్ని దగా చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 13వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రైతాంగానికి వ్యతిరేకంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 13న జరిగే రైతాంగానికి అండగా వైఎస్సార్ సీపీ పేరుతో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను మాజీ మంత్రి వెలంపల్లి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లాతో కలిసి వెలంపల్లి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు.

రైతుల సతమతం..

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏ పథకాన్ని అమలు చేయకుండా మాయమాటలు చెబుతుందని విమర్శించారు. ప్రధానంగా రైతాంగానికి గత ప్రభుత్వ రైతు భరోసా కింద రూ.13,500లు ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. నేడు దాని ఊసే ఎత్తటం లేదన్నారు. రాష్ట్రంలో చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని చెబుతున్న మంత్రులు ఎక్కడా ఆ దాఖలాలు లేవన్నారు. ముఖ్యంగా మద్దతు ధరను ఎక్కడా అమలు చేయటం లేదన్నారు. మద్దతు ధర లేక, గిట్టుబాటు ధర రాక రైతులు తమ ధాన్యాన్ని అతి తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారని చెప్పారు. మరో వైపు వర్షాలు, తుఫాన్‌ల హెచ్చరికలతో రైతులు మరింత ఇబ్బందులు పడి సతమతమవుతున్నారన్నారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వంటి అంశాలను సైతం ఈ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 13న అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నా, వినతి పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మహిళలు సవాళ్లను అధిగమించాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఉష

పటమట(విజయవాడతూర్పు): మహిళలు సవాళ్లను అధిగమించి ముందుకెళ్లాలని కృష్ణా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా అన్నారు. విద్యార్థినులు పర్సనల్ విషయాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్లేనన్నారు. మంగళవారం స్టెల్లా కళాశాలలో ఏపీ ఉమెన్ కమిషన్, స్టెల్లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసను నివారించడం ఎలా..? ఎదుర్కోవడం ఎలా అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న గృహహింస, లైంగిక వేధింపులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా కమిషన్ కార్యదర్శి వసంత బాలా మాట్లాడుతూ మహిళల భద్రతపై ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సీఐడీ సీఐ శిరీష మాట్లాడుతూ సమాజంలో మహిళల భద్రతకు, సైబర్ వేధింపుల నిరోధానికి కృషి చేస్తున్నామని, ఇటీవల కాలంలో మహిళలపై సైబర్ లైంగిక వేధింపులు అధికమయ్యాయని వీటిని నిరోధించాలంటే ఇతరులకు తమ వ్యక్తిగత ఫొటోలు పంపకూడదని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్, మహిళా కమిషన్ సభ్యులు షేక్ రుకియా బేగం, బూసి వినీత, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎన్టీయార్ జిల్లా పీడీ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు


స్విమ్మింగ్ పోటీల విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్‌లను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయవాడస్పోర్ట్స్: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని సర్ విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 170 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, కార్యదర్శి బత్తుల సుందర్‌రెడ్డి, యూత్ సర్వీస్ ఉపాధ్యక్షుడు నండూరి త్రినాథ్, సంయుక్త కార్యదర్శులు మద్దినేని శ్రీనివాస్, ఎడ్ల పార్థసారథి గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, దీనిలో భాగంగానే స్విమ్మింగ్ పోటీలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షులు కిషోర్ ఈ సందర్భంగా తెలిపారు. క్లబ్ ప్రతినిధులు సాగర్, దేవా, బాచి, విష్ణు, తొండేపు ఉదయ్ పోటీలను పర్యవేక్షించారు.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న దుర్గా శ్రీనివాసరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం కొండపల్లిలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథి అఖిల భారత లాయర్ల యూనియన్ కార్యదర్శి సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు కలిగి ఉండటానికి భారత రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితమే హక్కుల సాధనకు మార్గం ఏర్పడిందని వివరించారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వి.మురళీమోహన్, పి.కామేశ్వరరావు, వి.అమ్మాజీ, యల్లమందయ్య, చింతా నాగరాజు, సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయుక్తం.. అటల్ ఎఫ్‌డీపీ



విజయవాడస్పోర్ట్స్: అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సాంబశివరావు తెలిపారు. ఎస్ఆర్‌కే కాలేజీ చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ ప్రోత్సాహంతో 50 మంది అధ్యాపకులు బృందం అవేరా విద్యుత్ వాహన పరిశ్రమను మంగళవారం పరిశీలించింది. విద్యుత్ వాహనాల తయారీ ప్రక్రియ, మోటారు సిస్టం, బ్యాటరీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలను ఈ బృందం ప్రత్యక్షంగా చూసినట్లు కో ఆర్డినేటర్ చెప్పారు. విద్యార్థులకు గుణాత్మక బోధన అందించడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి అధ్యాపకులకు ఈ పర్యటన దోహదపడుతుందని చెప్పారు.

స్కేటింగ్ జాతీయ పోటీల్లో జెస్సిరాజ్‌కు సిల్వర్ మెడల్



విజయవాడస్పోర్ట్స్: జాతీయ 62వ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారిణి మాత్రపు జెస్సిరాజ్ సత్తా చాటింది. తమిళనాడు రాష్ట్రం పోలాచి నగరంలోని కేశవ విద్యా మందిర్ స్కేటింగ్ పార్క్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 14 నుంచి 17 ఏళ్ల విభాగం సోలో డాన్స్‌కు జెస్సిరాజ్ ఏపీకి ప్రాతినిధ్యం వహించి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. జెస్సిరాజ్ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఆమెను ఆర్టిస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రదీపక్ మాల్వాయి, ఏపీ ఆర్టిస్టిక్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ ఆకుల ప్రవీణ్ కుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి తామస్ చౌదరి, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. దీంతో జెస్సీ 50 పతకాల మైలురాయిని చేరుకుంది.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి


సీపీఎం మహా సభలో మాట్లాడుతున్న బాబూరావు

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో మోయలేని భారాలు మోపిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం విజయవాడ పశ్చిమ నగర 24వ మహాసభ వించిపేట, గొల్లపాలెంగట్టులో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలన ప్రజలను తీవ్ర నిరాశ పర్చిందన్నారు. 10 ఏళ్ల మోడీ పాలన దేశాన్ని, రాష్ట్రాన్ని నిండా ముంచేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గెలిచిన ఆరు నెలల్లో రూ.67 వేల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీలతో పాటు రాష్ట్ర హైవేల మీద కూడా టోల్ బాక్స్ పెడతామని చెప్పటం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో ఒక్క పెన్షన్లు పెంపు తప్పు మిగిలిన హామీలు అమలు జరగలేదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని పొందడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని విమర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఎన్నికలలో గెలవటానికి రూ.కోట్లు ఖర్చుచేసి ఇప్పుడు అవి వసూలు చేసుకునే పనిలో పడ్డారని విమర్శించారు. బుడమేరు వరద వచ్చి 100 రోజులు పూర్తయినా నేటికి బాధితులకు నష్టపరిహారం అందకపోవటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదే ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా హస్త కళాకారుల అభివృద్ధికి కృషి


సెమినార్‌లో మాట్లాడుతున్న శంకరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): హస్త కళాకారుల్లో మహిళలను ప్రోత్సహించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని కనెక్ట్ టు ఆంధ్ర సీఈఓ కోట్ల శివశంకరరావు పేర్కొన్నారు. భవానీ ఐలాండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ సహకారంతో మంగళవారం హస్తకళాకారులకు ఒక రోజు సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శంకరరావు మాట్లాడుతూ.. మహిళలు తాము తయారు చేసిన హస్తకళలను మార్కెటింగ్ చేసుకునేందుకు వ్యాపార మెలకువలను తెలుసుకుని రాణించాలని కోరారు. ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.శేఖర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో మహిళల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హస్త కళా సేవా కేంద్రం విజయవాడ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని హస్త కళల అభివృద్ధికి కేంద్ర సహకారంతో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. మహిళలు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.సుధీర్ కుమార్, శ్రీనివాస రావు, సహిత పలువురు ఆర్టిషన్స్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్



చంద్రగూడెం(మైలవరం): రెవెన్యూ సదస్సులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ అన్నారు. చంద్రగూడెం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వారి వ్యవసాయ భూముల సమస్యలను అర్జీల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రజల వద్దకే పాలకులు వచ్చి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సదస్సుకు రైతుల నుంచి 45 అర్జీలు అధికారులకు అందాయి. కార్యక్రమంలో మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, అటవీ శాఖాధికారులు, దేవదాయ శాఖాధికారులు, రిజిస్ట్రేషన్ శాఖాధికారులు, చంద్రగూడెం సర్పంచ్ బి. శ్రీనివాసరావు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఆటో ఢీ కొని ఒకరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీ కొని ఒకరికి గాయాలైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురానికి చెందిన లింగాబత్తిన సుశీల, సుధాకర్‌రావు(58)లు భార్యభర్తలు. సుధాకర్‌రావు తాపీ మేస్త్రీగా పని చేస్తుండగా, సుశీల ఆర్‌సీఎం స్కూల్‌లో వంట పని చేస్తుంటోంది. ఈ నెల 2వ తేదీ రాత్రి 8.20 గంటల సమయంలో సుధాకర్‌రావు పాముల కాల్వ వద్ద కీర్తి బార్ వద్ద నిల్చుని ఉండగా, గుర్తు తెలియని ఆటో వచ్చి ఢీ కొట్టింది. దీంతో సుధాకర్‌రావుకు గాయాలు కాగా మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం దుష్ఫలితాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

మైలవరం: సారా అమ్మడం, తరలించడం చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ అన్నారు. రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సారా మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. కూనపురాజుపర్వ గ్రామం ఉత్తర, దక్షిణ దళితవాడల్లో సారా తయారీ, విక్రయాలపై ఆరా తీశారు. సారా దష్పలితాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు రాయుడు, పంచాయతీ వార్డు సభ్యుడు సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు. జి.కొండూరు మండలం కోడూరు గ్రామంలో ముక్కమల్ల వెంకటరావు మద్యం అమ్ముతుండగా అరెస్ట్ చేశారు. ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.